ప్రభుత్వ తీరుతో నష్టపోతున్నాం



రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే ఆలోచన, సీట్లు తగ్గించాలనే నిర్ణయంతో ఎన్నో ఆశలతో ఉన్న మేము నష్టపోయే అవకాశం ఉంది. ఎంతో సమయం, నగదు వెచ్చించి నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నా. ర్యాంకు వచ్చినా సీటు వస్తుందో రాదో అని ఆందోళన చెందుతున్నాను. మా లాంటి వారికి వైద్య విద్య కలగా మిగిలిపోకుండా ప్రభుత్వం న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

– తజ్మీన్, నీట్ విద్యార్థిని, దువ్వూరు



నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి



ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్ల తగ్గించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతారు. పేదలకు ఉచిత వైద్యం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. కావున ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

– ఎస్.అమీర్ బాషా, నీట్ విద్యార్థి తండ్రి, దువ్వూరు

మురుగు పారదు.. కంపు వదలదు

- డ్రైనేజీ దుర్వాసనతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- మహిళా హాస్టల్ వద్ద కుంటగా మారిన వైనం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఉమెన్స్ హాస్టల్ వద్ద మురుగు నీరు చెరువును తలపిస్తోంది. ఏళ్ల తరబడి మురుగు నీరు అలాగే ఉండటంతో పందులు నివాసం ఏర్పరచుకున్నాయి. ఈ ప్రభావం కారణంగా దుర్వాసనతో.. చుట్టూ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలకు అనుబంధంగా సమీపంలోనే ఉమెన్స్ హాస్టల్ నిర్మించారు. హాస్టల్‌కు వినియోగించే నీరు బయటికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అక్కడే నీరు నిలిచి ఉంది. పక్కనే ఉషోదయ హైస్కూల్ వీధి ఉంది.

ఈ ప్రాంతంలో నిత్యం పందులు సంచరిస్తుండటంతో దుర్వాసనకు.. ప్రజలు నివాసాల్లో ఉండటానికి ఇబ్బందికరంగా మారింది. ఏళ్ల తరబడిగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వం అన్ని చోట్ల డయేరియా నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా ఇక్కడ మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించి తమకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉమెన్స్ హాస్టల్ వద్ద నిలిచిన మురికి నీరు

చాలా ఇబ్బందికరంగా ఉంది



ఉమెన్స్ హాస్టల్ వద్ద ఉన్న మురికి నీరుతో చాలా ఇబ్బందికరంగా ఉంది. దుర్వాసన వస్తుండటంతో ఇంటి తలుపులు తెరవడానికి ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఇక్కడ పందులు సంచరిస్తున్నాయి.

– జయప్రతాప్‌రెడ్డి, ప్రొద్దుటూరు

కమిషనర్ పరిశీలించారు



గతంలో ఈ సమస్యపై ఫిర్యాదు చేసినప్పుడు మున్సిపల్ కమిషనర్ వచ్చి పరిశీలించారు. అయితే సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. మురికి నీటితో సహవాసం చేసే పరిస్థితి ఏర్పడింది.

– జంపాల సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు

కలెక్టర్ స్పందించాలి



ఉమెన్స్ హాస్టల్‌కు సంబంధించిన మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటా తమతోపాటు ఉమెన్స్ హాస్టల్ విద్యార్థినులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

– వీరారెడ్డి, ప్రొద్దుటూరు

పర్యావరణాన్ని కాపాడుకుందాం



వైష్ణవి పాఠశాల విద్యార్థుల ర్యాలీ

పోరుమామిళ్ల : ఓజోన్ డే సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం పోరుమామిళ్లలో వైష్ణవి పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామకృష్ణ, హెడ్‌మాస్టర్ కల్యాణి మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ కాలుష్యం వల్లనే ఓజోన్ పొర దెబ్బతింటుందన్నారు.

కాలుష్యానికి కారణమైన ఇంధన వనరులను, విద్యుత్ పరికరాల వాడకాన్ని తగ్గించాలన్నారు. చెట్లను పెంచాలన్నారు. పట్టణంలో విద్యార్థుల ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీ

పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో మిలాద్-ఉన్-నబీ శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ముస్లింలు జెండాలు చేతపట్టుకుని అల్లా నామస్మరణ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా అడుగుజాడల్లో నడవాలని, అల్లా గొప్పతనాన్ని, ఆయన మానవాళికి చేసిన మేలును, మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను, సందేశాలను శిరసావహించాలని మత పెద్దలు వివరించారు. మైదుకూరు రోడ్డులోని నజీరుల్లాషా మఠం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పుట్టపర్తి సర్కిల్, గంగమ్మ దేవాలయం వీధి, గాంధీరోడ్డు మీదుగా సుందరాచార్యుల వీధిలోని అసారేషరీఫ్‌కు చేరింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్,



ప్రొద్దుటూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఇలియాస్, టౌన్‌బ్యాంక్ ఉపాధ్యక్షుడు ఖలీల్, కౌన్సిలర్‌లు గౌస్, కమాల్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఫరీద్, ముస్లిం మత ప్రముఖులు, పట్టణంలోని 40 మసీదుల కమిటీ పెద్దలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



వినాయక విగ్రహం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు



నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న పూజారులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీరామ అపార్ట్‌మెంట్ వద్ద శ్రీవరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు మునిరెడ్డిని శ్రీవరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేష్, గౌస్, విజయ్, తరుణ్, రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వార్యల గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి వీడ్కోలు

చాపాడు : మండల పరిధిలోని సీతారామాపురం వద్ద సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. అల్లాడుపల్లె దేవాలయాలలోని పూజారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారిని పల్లకీపై మోసుకు వచ్చి నిమజ్జనం నిర్వహించారు. ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు గురు సతీష్

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని మండలంలోని విశ్వనాథపురం సమీపంలోని మొర్రాయిపల్లె క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జమాల్ గారి గురు సతీష్ (36) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైదుకూరు పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గురు సతీష్ వృత్తి రీత్యా భవన నిర్మాణ (బేల్దారి) కార్మికుడు. సోమవారం పని ముగించుకుని ఏపీ04బీడబ్ల్యూ7631 నంబరు గల స్కూటీలో మైదుకూరుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మొర్రాయిపల్లె క్రాస్ రోడ్డు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై ఇటీవల స్పీడ్ బేకర్ నిర్మించారు. ఈ క్రమంలో స్కూటీలో వస్తున్న గురు సతీష్ ప్రమాదశాత్తు స్కూటీపై నుంచి అదుపుతప్పి క్రింద పడ్డారు. ఈ ప్రమాదంలో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడు రాజశేఖర్

మండల పరిధిలోని మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని మొర్రాయిపల్లె క్రాస్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దువ్వూరు మండలంలోని గొల్లపల్లెకు చెందిన రాజశేఖర్ ఖాజీపేట మండలంలోని భీచువారిపల్లెలోని బంధువుల ఇంటికి బైక్‌లో వెళుతుండగా ప్రమాదవశాత్తు మొర్రాయిపల్లె క్రాస్ రోడ్డు వద్ద అదుపు తప్పి క్రింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను చాపాడు పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు బ్రహ్మంసాగర్ నుంచి నీటి విడుదల

పోరుమామిళ్ల: బ్రహ్మంసాగర్ నుంచి మంగళవారం ఎడమ కాలువకు నీరు విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వర్షాలు కురవడం, నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు పుష్కలంగా ఉండడం వలన తాగు, సాగునీటికి ఇబ్బంది కలుగలేదని పేర్కొన్నారు. ఇప్పుడు వానలు లేక నీటి సమస్య ఏర్పడిందని చెప్పారు. అందువల్ల అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు అంగీకారం తీసుకున్నామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీ హోమాలను నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొప్పర్తి సమీపంలోని ఎయిల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో సీసీ కెమెరాల తయారీ విభాగంలో నియామకం కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ చదివిన 19 నుంచి 32 ఏళ్ల వయసు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం అందిస్తారని, ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, మార్కు లిస్టు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాన్ కార్డు, 2 ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9515437935 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు

మైదుకూరు : మండలంలో మంగళవారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవాపై అవగాహన కార్యక్రమాలు, మానవ హారాలు, స్వచ్ఛత పరుగును నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు. పాఠశాలలు, ప్రజా సమూహాలలో విద్యార్థులు, ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. మొక్కలను నాటడం, నీరు, విద్యుత్ శక్తి ఆదాపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన, ఆరోగ్యకరమైన జీవనం, నీటి నిల్వ, నీటి పథకాల శుభ్రత తదితర అంశాలపై వార్డు, గ్రామ సభలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మైదుకూరులో ర్యాలీ

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం మైదుకూరు పట్టణంలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి రాయల కూడలి వరకు ఈ ర్యాలీ జరుగుతుందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

చాపాడు మండలంలో..

చాపాడు : మండలంలో మంగళవారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మొక్కలు నాటడం, పారిశుద్ధ్య పనులు చేపట్టడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

'గురువును సన్మానించడం నా అదృష్టం'

బద్వేలు అర్బన్ : ప్రముఖ సాహితీవేత్త, మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పుట్టినరోజు వేడుకలు సోమవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైదుకూరు ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు తన భవిత నిర్మాణంలో తోడ్పాటు అందించిన నా గురువు హనుమంతరావును సత్కరించే భాగ్యం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ప్రముఖ రంగస్థల నటుడు మధుబాబు, నెల్లూరు తిక్కన మహాకవి లలిత కళాపీఠం అధ్యక్షులు ఆలూరిశిరోమణిశర్మ, అష్టావధానులు మాడుగుల శివశ్రీశర్మ, జగన్నాథశాస్త్రి, తెలుగుభాష సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, జానపద గాయకుడు కోటపాటి ఓబులేసు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్య, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లిచిన్నరసుబ్బారావు, హనుమంతరావు శిష్య బృందం పాల్గొన్నారు.



హనుమంతరావును సన్మానిస్తున్న సుధాకర్‌యాదవ్

పింఛన్లు.. పడిగాపులు

- పనిచేయని పింఛన్ల నమోదు సర్వర్
- ఎన్నికలు పూర్తయ్యి మూడు నెలలు అయినా పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం
- పింఛన్ల కోసం ఎన్ని నెలలు వేచి ఉండాలోనంటూ అర్హుల ఆవేదన

కాశినాయన : నరసాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వృద్ధునికి నాలుగు నెలల క్రితమే 60 సంవత్సరాలు వయస్సు నిండింది. పింఛన్‌కు అర్హత వచ్చింది కదా అని దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే ఇంకా సర్వర్ పని చేయడం లేదని చెప్పారని వాపోయారు. ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన పుల్లమ్మ భర్త మూడు నెలల క్రితమే చనిపోవడంతో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదు, మళ్లీ రావాలని చెప్పారంటూ కన్నీటిపర్యంతమైంది. ఎస్టీ కాలనీకి చెందిన హనుమంతు కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయానికి వెళితే ఇంకా అనుమతులు రాలేదు, దరఖాస్తులు తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నాడు. ఇదీ ప్రస్తుత కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుకుంటున్న వారి మనోవేదన. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పింఛన్లు, కొత్తరేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా చేసింది. పింఛన్ల నమోదుకు సంబంధించిన వెబ్‌సైట్ పని చేయడంలేదు. ఇంకెప్పుడు మాకు పింఛన్ల తీసుకోగలమో అర్థం కావడంలేదంటూ అర్హులు చెబుతున్నారు. కొత్త పింఛన్ దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని అర్హులు చెబుతున్నారు. అంతేకాకుండా కొత్తగా వివాహాలు అయినవారు కొత్తగా రేషన్‌కార్డు పెట్టుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ చేస్తుందా అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన వెబ్‌సైట్

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి రావడంతో ఆగిన పింఛన్ల నమోదు వెబ్‌సైట్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తీసుకునేందుకు 60 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగ నిర్ధారణ ధృవీకరణపత్రం ఉన్నవారు, భర్త చనిపోయిన వితంతువులు కొత్త పింఛన్ కోసం కనీసం అప్లికేషన్ ఇద్దామన్నా పని జరగకపోతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. అలాగే కొత్తగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడు అనుమతి ఇస్తుందా అని కొత్త రేషన్‌కార్డుదారులు పడిగాపులు కాస్తున్నారు.



కొండ్రాజుపల్లె సచివాలయం

గత ప్రభుత్వంలో ఇలా

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి ధృవపత్రాలు తీసుకుని అర్హులైన వారిని గుర్తించి వలంటీర్లే దరఖాస్తులు చేసేవారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు వలంటీర్లే సచివాలయంలో దరఖాస్తులను అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకు పాత పింఛన్ల పంపిణీ తప్ప మరే ఇతర సంక్షేమం అందించే ఊసే లేదంటూ ప్రజలు మండిపడుతున్నారు. వచ్చే నెలలో ఓపెన్ చేస్తారనే ఊహాగానాలు వెలువడుతుండటంతో ప్రజలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. అనుమతులు వచ్చిన తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తాం. అంతవరకు సంయమనం పాటించాలి. పింఛన్ల అర్హులు సచివాలయ సిబ్బందికి సహకరించాలి.

– మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

కడపలో అగ్నిప్రమాదం

కడప అర్బన్: కడప నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో అమ్మవారిశాల వెనుకాల ఓ నివాస గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమ వారం ఉదయం 9:30 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామాన్లతో పాటు, వ్యాపారానికి ఉపయోగిస్తున్న జీడిపప్పు, బాదం పప్పులు, బిర్యానీ ఆకులు మొదలైనవి కాలిపోయాయి.

నిజాయితీ ఐపీఎస్ అధికారులపై రెడ్‌బుక్ కుట్ర

రాజంపేట : నిజాయితీగా సేవలందించిన ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ ఆధారంగా కక్షసాధింపు చర్యలకు దిగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి (విస్సీ) అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముంబై నటి జెత్వానీ పేరుతో పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీలను సస్పెన్షన్ చేయించడం కూటమి ప్రభుత్వం పన్నాగమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పాలన అందించిన ఐపీఎస్ అధికారుల పట్ల కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఇప్పటికే ఐపీఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోందన్నారు. కూటమి పాలనలో కేసులు, దౌర్జన్యాలు, ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను లొంగదీసుకునేందుకు వివిధ రకాల బెదిరింపులకు పాల్పడటం యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపకుండా, అప్రజాస్వామిక రాజకీయాలను చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక వైఖరిని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయడమే కాక ప్రజాపోరాటాలు చేస్తామన్నారు.

క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు : పట్టణంలోని యాచకులు, వృద్ధులు, సాధువులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా సోమవారం పెయింటర్ ఫరూక్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్‌కుమార్, నారాయణరెడ్డి, చరణ్, శ్రీకాంత్, న్యాయవాది సుమంత్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



జశ్వంత్‌కు వీల్‌చైర్ అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన కొప్పరపు వెంకటప్రసాద్, సుజనల కుమారుడు జశ్వంత్ కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఆసుపత్రిలో చూపించినా ప్రయోజనం లేకుండా పోయింది. మంచానికే పరిమితమై కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి జశ్వంత్‌కు వీల్‌చైర్ అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. రామకృష్ణారెడ్డికి జశ్వంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘన నివాళి



వెంకటసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన కత్తెరపల్లి వెంకటసుబ్బారెడ్డి అనారోగ్య కారణంగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, శేషారెడ్డి, నాయకులు పోలిరెడ్డి, రామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న మంత్రి మిత్ర బృందం

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక వైఎంఆర్ కాలనీలోని డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి నివాసం వద్ద మంత్రి మిత్రబృందం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రజలు, మంత్రి అభిమానులు, సన్నిహితులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అలాగే సుమారు 150 మంది అయవదానం చేయడానికి వారి పేర్లను రిజిష్టర్ చేసుకున్నారు. అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ ఎందరికో ఆదర్శమని తెలిపారు. మన ప్రాంత వాసి అయిన సత్యకుమార్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఒంటేరు భాస్కర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, దారా సంతోష్‌కుమార్, రాజాబాబు, నాగరాజు, సతీష్, సత్యకుమార్ యువసేన నాయకులు, మిత్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష



పెద్దమ్మ ఆలయం వద్ద దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న పెద్దమ్మ ఆలయ గదులను కూల్చొద్దని ఆలయం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు చేపడుతున్న దీక్ష సోమవారానికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ పెద్దమ్మ ఆలయానికి సంబంధించి వంటశాల, అమ్మవారి సామాన్ల గది, భక్తులు అన్నం తినేందుకు గది ఉందని తెలిపారు. ఈ గదుల కూల్చివేతకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వులు వెనక్కి తీసుకునేంత వరకు దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన ఉపాధ్యక్షుడు సాకే నారాయణస్వామి, ప్రసాద్, సుబ్బరాయుడు, మారయ్య, మద్దిలేటమ్మ తదితరులు పాల్గొన్నారు.